క్లుప్తంగా

రైల్వే రిజర్వేషన్ కార్యాలయం మార్పు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): బెంజిసర్కిల్ సమీపంలోని బీఎస్ఎన్ఎల్ బిల్డింగ్‌లోని రైల్వే రిజర్వేషన్ కార్యాలయాన్ని ఎంజీ రోడ్డు, మున్సిపల్ స్టేడియం కాంప్లెక్స్ వద్ద ఈట్ స్ట్రీట్‌కు మార్చనున్నట్లు రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రిజర్వేషన్ కౌంటర్‌లో గురువారం ఉదయం 8 గంటల నుంచి కార్యకలాపాలు కొనసాగనున్నాయి. ప్రజలు ఈ మార్పును గమనించి రైల్వే సేవలు పొందాలని కోరారు.

దోమల నిర్మూలనపై అవగాహన ర్యాలీ



పాయకాపురం(విజయవాడరూరల్): దోమలను అరికట్టడం వలన అనేక వ్యాధుల బారి నుంచి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చునని సబ్‌యూనిట్ మలేరియా అధికారి హరిశంకర్ అన్నారు. 61వ డివిజన్ అర్బన్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో డెంగీ మాసోత్సవం సందర్భంగా బుధవారం ప్రజలకు అవగాహన కల్పిస్తూ వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. హరిశంకర్ మాట్లాడుతూ ఇంటి ఆవరణ, సైడు కాల్వల్లో వర్షం నీరు, మురుగునీరు నిల్వలు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇంటి ఆవరణలో పనికిరాని తొట్టెలు, డబ్బాలు, టైర్లు, కొబ్బరిచిప్పలు లాంటి వాటిల్లో వర్షపు నీరు చేరి దోమలు ఉత్పత్తి అవుతాయన్నారు. అలాంటి వాటిని తొలగించాలన్నారు. డాక్టర్ ఎం.క్రాంతికిరణ్, ఏఎన్ఎమ్‌లు, ఆశావర్కర్‌లు పాల్గొన్నారు.

16న బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక

విజయవాడ స్పోర్ట్స్: ఉమ్మడి కృష్ణాజిల్లా సబ్ జూనియర్ బాలబాలికల బాస్కెట్‌బాల్ జట్లను ఈ నెల 16వ తేదీన నూజివీడులోని ధర్మ అప్పారావు కళాశాలలో ఎంపిక చేస్తున్నట్లు కృష్ణాజిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.ఎస్.సి.బోస్ తెలిపారు. 2010 జనవరి ఒకటో తేదీ తర్వాత పుట్టిన వారు ఈ ఎంపిక పోటీలకు అర్హులన్నారు. ఆ రోజు మధ్యాహ్నం మూడు గంటలకు ఈ పోటీలు ప్రారంభమవుతాయన్నారు. ఆసక్తి, అర్హత ఉన్న క్రీడాకారులు ఆధార్‌కార్డు, మీసేవా నందు తీసుకున్న జనన ధ్రువీకరణపత్రంతో సంప్రదించాలన్నారు. ఎంపికైన జట్లు రాష్ట్ర స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తాయన్నారు.

గంజాయి కలిగిన యువకుల అరెస్టు

పాయకాపురం(విజయవాడరూరల్): వాంబే కాలనీలో గంజాయి కలిగివున్న ముగ్గురు వ్యక్తులను నున్న పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. సీఐ కె.శ్రీనివాసరావుకు వచ్చిన సమాచారం మేరకు ఎస్ఐ ఎస్.శ్రీనివాస్, సిబ్బంది వాంబేకాలనీలో తనిఖీలు నిర్వహించగా షేక్ జాఫర్ సాధిక్ అలియాస్ చోటువద్ద కేజీ 1101 గ్రాములు, వి.నాగరవితేజ వద్ద 1060 గ్రాములు, సమీర్‌అహ్మద్ వద్ద 1090 గ్రాములు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి కేసు నమోదు చేశారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

పాయకాపురం(విజయవాడరూరల్): ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన శాంతినగర్‌లో చోటుచేసుకుంది. పెరబోయిన అన్నపూర్ణ అనే మహిళకు యశ్వంత్, కళ్యాణ్ నాగరాజు అనే ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. పెద్ద కుమారుడు యశ్వంత్ (22) తాపీ పనిచేస్తుండగా, చిన్న కుమారుడు కొరియర్‌లో పని చేస్తుంటాడు. మంగళవారం సాయంత్రం ఇంట్లో ఎవ్వరూలేని సమయంలో తలుపులు వేసుకొని యశ్వంత్ వంట గదిలో ఫ్యాను ఉక్కుకు చీరెతో ఉరేసుకొన్నాడు. చిన్న కుమారుడు రాత్రి ఇంటికి వచ్చి చూడగా అన్న ఉరివేసుకున్నట్లు గుర్తించి తల్లికి చెప్పాడు. స్థానికుల సహాయంతో యశ్వంత్‌ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద కేసు నమోదు చేశారు.

నగరంలో 144 సెక్షన్ అమలు

విజయవాడ స్పోర్ట్స్: నగరంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా ఈ నెల 10వ తేదీ నుంచి 144(2) సీఆర్‌పీసీ సెక్షన్‌ను అమలు చేస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టీకే రాణా బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆగస్టు 28వ తేదీ వరకు 50 రోజుల పాటు ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయన్నారు. ఇబ్రహీంపట్నం, భవానీపురం, వన్ టౌన్, టూ టౌన్, సత్యనారాయణపురం, అజిత్‌సింగ్‌నగర్, నున్న, గవర్నర్‌పేట, సూర్యారావుపేట, కృష్ణలంక, మాచవరం, గుణదల, పటమట పోలీస్ స్టేషన్ల పరిధిలో నలుగురు, అంతకుమించి ఎక్కువ మంది ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో గుమిగూడరాదని తెలిపారు. కర్రలు, రాళ్ళు, మారణాయుధాలు పట్టుకుని తిరగరాదని హెచ్చరించారు. ఈ నిబంధనలను అతిక్రమించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

జగనన్న సురక్షలో సత్వరమే సమస్యలు పరిష్కారం

ఎమ్మెల్యే మల్లాది విష్ణు

సత్యనారాయణపురం(విజయవాడపశ్చిమ): ప్రజా సంక్షేమమే పరమావధిగా పేదలు క్షేత్రస్థాయిలో ఎదుర్కొనే సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా ప్రవేశపెట్టిందని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. 33వ డివిజన్ సత్యనారాయణపురంలో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరంలో స్థానిక కార్పొరేటర్ శర్వాణీ మూర్తితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వచ్ఛ సర్వేక్షణ్ కోసం ప్లాస్టిక్ బాటిళ్లతో సచివాలయ సిబ్బంది తయారుచేసిన కుర్చీలు, వస్తువులను పరిశీలించిన ఆయన వారిని ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతిఒక్కరికీ ప్రభుత్వ సేవలు ఉచితంగా అందించాలన్నదే జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. ఇందులో భాగంగానే సురక్ష కార్యక్రమం ద్వారా 11 రకాల సేవలను సత్వరమే అందిస్తున్నట్లు చెప్పారు. కుల, ఆదాయ, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, రేషన్ కార్డుల్లో మార్పులు వంటివి చాలా సులభతరం చేస్తూ ప్రభుత్వ వ్యవస్థను ప్రజల చెంతకు చేరవేయడం జరిగిందన్నారు.

1406 అర్జీలు సేకరణ....

డివిజన్‌లలో వారం రోజులపాటు నిర్వహించిన సర్వే ద్వారా 1,406 అర్జీలు సేకరించినట్లు తెలిపారు. వీరిలో 544 మంది కుల సర్టిఫికెట్ల కోసం, 597 మంది ఆదాయ సర్టిఫికెట్ల కోసం, 26 మంది బియ్యం కార్డుల కొరకు వినతులు అందజేసినట్లు పేర్కొన్నారు. వీరందరికీ ఎటువంటి రుసుం లేకుండా పూర్తి ఉచితంగా సర్టిఫికెట్లు అందజేస్తున్నట్లు తెలిపారు. అదే గత ప్రభుత్వంలో ప్రజల నుంచి సేకరించిన వేలాది అర్జీలు నేటికీ స్టోర్ రూంలలోనే మగ్గుతున్నాయని మల్లాది విష్ణు గుర్తుచేశారు. కానీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ప్రభుత్వ దృష్టికి వచ్చే సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందన్నారు. అలాగే జగనన్న సురక్ష ద్వారా ప్రతి డివిజన్‌లో కనీసం వెయ్యి దరఖాస్తులకు తక్షణ పరిష్కారం చూపడం జరుగుతోందన్నారు. ఈ సేవలను ప్రజలందరూ వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నార్త్ తహసీల్దార్ మాధురి, స్పెషల్ ఆఫీసర్ రామకోటేశ్వరరావు, అసిస్టెంట్ కమిషనర్–2 అనసూయ, సచివాలయ సిబ్బంది, వైఎస్సార్ సీపీ డివిజన్ కోఆర్డినేటర్ దోనేపూడి శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు సర్టిఫికెట్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే విష్ణు, పక్కన కార్పొరేటర్ శర్వాణిమూర్తి

యజ్ఞంలా జగనన్న సురక్ష

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న సురక్ష కార్యక్రమం ఒక మహా యజ్ఞంలా సాగుతోందని సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంతో లబ్ధిదారులు సంతోషంగా ఉన్నారన్నారు. బుధవారం జింఖానా మైదానంలో 36 వ డివిజన్‌కు సంబంధించి జగనన్న సురక్ష శిబిరం నిర్వహించారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, స్థానిక కార్పొరేటర్ బాలిగోవింద్‌తో కలిసి ఎమ్మెల్యే విష్ణు శిబిరంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లాది విష్ణు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం సురక్ష ద్వారా పేదలకు అందిస్తున్న సేవలను వివరించారు. గత ప్రభుత్వంలో సర్టిఫికెట్ల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ రోజుల తరబడి కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేదని గుర్తుచేశారు. సురక్ష కార్యక్రమం ద్వారా అటువంటి సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన విప్లవాత్మకమైన ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు ఉచితంగా 11 రకాల ధ్రువీకరణ పత్రాలు అక్కడికక్కడే అందజేస్తున్నట్లు చెప్పారు. సరైన అవగాహన లేక మిగిలిపోయిన లబ్ధిదారులు, ఇతర సమస్యలతో ధ్రువపత్రాలను పొందలేని ప్రజలకు సురక్ష కార్యక్రమం ఎంతగానో దోహదపడుతోందని తెలిపారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు సురక్ష పథకం ఎన్నో విధాలుగా మేలు చేకూరుతుందని పేర్కొన్నారు.

36వ డివిజన్‌లో 1435 మందికి ధ్రువీకరణ పత్రాలు పంపిణీ....

శిబిరం ద్వారా డివిజన్‌లో 628 మందికి కుల ధ్రువీకరణ, 460 మందికి ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు వివిధ రకాల సేవల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు 1,435 ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందజేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ తహసీల్దార్ శ్రీనివాస్ వెన్నెల, స్పెషల్ ఆఫీసర్ రామకోటేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్ ధీరజ్ శ్రీకృష్ణకు ఎమ్మెల్యే అభినందనలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): యువత క్రీడల్లో రాణించి దేశానికి, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు కోరారు. ఇటీవల ఉత్తరాఖండ్ రిషికేష్ లో జరిగిన 4వ అంతర్జాతీయ యోగా చాంపియన్‌షిప్ లో పసిడి పతకాన్ని కైవసం చేసుకున్న నగరానికి చెందిన దేవరాజుగట్టు ధీరజ్ శ్రీకృష్ణను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ మేరకు బుధవారం ఆంధ్రప్రభ కాలనీలోని తన క్యాంపు కార్యాలయంలో బాలుడిని సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ ధీరజ్ లో అద్భుతమైన అభ్యాస సామర్థ్యం, నైపుణ్యం దాగి ఉన్నాయని తెలిపారు. చిన్న వయస్సులోనే అంతర్జాతీయ యోగా చాంపియన్ షిప్‌లో రాణించి 'చాంపియన్ ఆఫ్ చాంపియన్ టైటిల్' ను సొంతం చేసుకోవడం అభినందనీయమన్నారు. రానున్న రోజుల్లో ధీరజ్ మరిన్ని విజయాలు అందుకోవాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఎన్టీఆర్ జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ సెక్రటరీ ఎల్.మురళీకృష్ణ, తల్లిదండ్రులు దేవరాజు గట్టు నాగరాజు, శశికళ ఉన్నారు.

నవరత్నాలతో పేదలకు భరోసా

ఎమ్మెల్యే మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల అమలుతో పేదలకు భరోసా కల్పించారని, అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ పథకాలను కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అందిస్తున్న ఏకైక ప్రభుత్వం తమదేనని ఎమ్మెల్యే, ఏపీ ప్రణాళికాబోర్డు వైస్ చైర్మన్ మల్లాది విష్ణు అన్నారు. 30 వ డివిజన్ 246 వ వార్డు సచివాలయ పరిధిలో బుధవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వంలో స్థానిక కార్పొరేటర్ జానారెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు తీరును వివరిస్తూ.. ఏ ఇంటికి ఏ పథకం ద్వారా ఎంత లబ్ధి చేకూరిందో వివరించారు. సామాజిక తనిఖీల ద్వారా లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపికి చేసి ఆయా పథకాలను అందజేస్తున్నట్లు చెప్పారు. జగనన్న సురక్ష క్యాంపుపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు సూచించారు.

వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని మల్లాది విష్ణు తనిఖీ చేశారు. చికిత్స కోసం వచ్చిన రోగులతో అందుతున్న సేవల గురించి మాట్లాడారు. అందుబాటులో ఉన్న మందులు, చిల్డ్రన్ వ్యాక్సినేషన్, షుగర్, మలేరియా, డెంగీ టెస్టులపై సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రికి అవసరమైన పరికరాలు అందుబాటులో ఉన్నాయా లేదా..? అని వైద్యులతో మాట్లాడారు. ఉదయం 7 గంటల నుంచే అర్బన్ హెల్త్ సెంటర్లో షుగర్ టెస్టులు నిర్వహించాలని తెలిపారు. ప్రజలకు నాణ్యమైన సేవలను అందించడంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.



లబ్ధిదారులతో ఎమ్మెల్యే మల్లాది విష్ణు

పవన్ కళ్యాణ్ రాజకీయ జలగ...

చంద్రబాబు ఛీ అన్న, పో అన్న టీడీపీ చూరు పట్టుకుని వేలాడుతున్న పవన్ కళ్యాణ్‌ను మించిన రాజకీయ జలగ దేశంలోనే మరొకరు ఉండరని మల్లాది విష్ణు అన్నారు. ప్రజలకు నిస్వార్థంగా సేవలందిస్తున్న వలంటీర్ల ఆత్మస్థైర్యం దెబ్బతీసేలా పవన్ మాట్లాడటం దుర్మార్గమన్నారు. గతంలో చంద్రబాబు సైతం వలంటీర్లను అవహేళన చేస్తూ మాట్లాడి ప్రజాక్షేత్రంలో అభాసుపాలయ్యారని గుర్తుచేశారు. ప్రస్తుతం అదే బాటలో పవన్ కళ్యాణ్ నడుస్తూ.. వలంటీర్ వ్యవస్థను కించపరిచేలా మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. పైగా బ్రిటీషర్లతో పోలుస్తూ.. వారి వ్యక్తిగత ప్రతిష్టకు భంగం కలిగించేలా మాట్లాడుతున్నారని నిప్పులు చెరిగారు. పవన్ మాట్లాడుతుంది తప్పు అని ముక్తకంఠంతో రాష్ట్ర ప్రజలందరూ చెబుతున్నా.. జనసేన అధినేత తీరులో ఏ మాత్రం మార్పు రావడం లేదని మండిపడ్డారు. చూస్తుంటే పవన్ మానసిక పరిస్థితి ప్రమాదకరంగా మారిందనే అనుమానం కలుగుతోందన్నారు. ఒక అబద్ధాన్ని నిజం చేసేందుకు దుష్టచతుష్టయం నానా తంటాలు పడుతోందని.. ఇందుకోసం మంచి చేస్తున్న ప్రభుత్వంపై దాడి చేస్తున్నారని ధ్వజమెత్తారు. సీఎంఓహెచ్ డాక్టర్ రత్నావళి, డీఈ రామకృష్ణ, సీడీఓ జగదీశ్వరి, నాయకులు మూర్తి చంద్రమౌళి,అన్ని శాఖల అధికారులు వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వలంటీర్ సేవలకు వందనం

మధురానగర్(విజయవాడ సెంట్రల్): వలంటీర్ల సేవలకు జనం జేజేలు పలుకుతున్నారు. నిస్వార్థంగా ప్రజలకు సేవలు అందిస్తున్న వలంటీర్లను ఎన్నటికీ మర్చిపోలేమని చెబుతున్నారు. కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పని లేకుండా నేరుగా ఇళ్ల వద్దకే వచ్చి సేవలు అందిస్తున్నారని ప్రశంసిస్తున్నారు. గతంలో ప్రభుత్వ కార్యాలయాల్లో ఏ సర్టిఫికెట్ కావాలన్నా నరకయాతన అనుభవించే వాళ్లమని... కానీ నేడు జగనన్న ప్రభుత్వంలో వలంటీర్లే తమ పనులు చేస్తున్నారని అంటున్నారు.

దేవుడు ఇచ్చిన వరం వలంటీర్లు



గతంలో పింఛన్ కోసం ఆఫీసు చుట్టూ తిరగాల్సి రావటంతో పాటు చాలాసేపు నిరీక్షించాల్సి వచ్చేది. వలంటీర్ వ్యవస్థ వచ్చిన తరువాత ఠంచన్‌గా ఒక్కటో తేదీ తెల్లవారుజామున తలుపుతట్టి మరీ పింఛన్ అందజేస్తున్నారు. నిద్రలేవక ముందే జీతం మాదిరిగా పింఛన్‌ను అందజేస్తున్న వలంటరీ వ్యవస్థ దేశానికే ఆదర్శం. ముఖ్యంగా మా వంటి వృద్ధులకు వలంటీర్‌లు దేవుడు ఇచ్చిన వరంగా భావిస్తున్నాం.

–యర్రంశెట్టి నరసింహారావు, గులాబీతోట

వలంటీర్ సేవలను మరువలేను



తెలంగాణ నుంచి మేము నగరానికి వచ్చాం. అక్కడ కుల ధ్రువీకరణ పత్రం కోసం ఎన్నో సార్లు ఆఫీసుల చుట్టూ తిరిగినా సర్టిపికెట్ రాలేదు. ఇక్కడకు వచ్చిన తరువాత వలంటీర్ ఇంటికి వచ్చి మరీ మా సమస్యలను అడిగి తెలుసుకోవటంతో పాటు ప్రభుత్వ పథకాలు గురించి వివరించారు. నాకు సర్టిఫికెట్ కావాలని చెప్పగా వలంటీర్ కుల ధ్రువీకరణ పత్రంను మాకు ఉచితంగా అందజేశారు. వలంటీర్ సేవలను జీవితంలో మరువలేను.

–డి.అనిత, ముత్యాలంపాడు

పవన్‌కళ్యాణ్ పేదల వ్యతిరేకి



పవన్ వ్యాఖ్యలకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తున్న బీసీ సంఘ నేతలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ ముమ్మాటికీ పేదల వ్యతిరేకి అని ఏపీ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎన్ మారేష్ అన్నారు. ఏపీ బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు అర్షద్ ఆధ్వర్యంలో పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలకు వ్యతిరేకంగా పంజా సెంటర్ వద్ద బుధవారం సాయంత్రం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన మారేష్ మాట్లాడుతూ పేదల సంక్షేమానికి వారధిలా పని చేస్తున్న వలంటరీ వ్యవస్థను అవమానించడం దుర్మార్గమన్నారు. దీనిని ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం తరపున తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. వలంటరీ వ్యవస్థకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వలంటరీలను అవమానించడం అంటే పేదలను అవమానించినట్లేనని పేర్కొన్నారు. పవన్ కేవలం తన రాజకీయ ఉనికి కోసం మాట్లాడుతున్నాడే తప్ప తన పార్టీకి గాని తనకి గాని ప్రజల మీద ఎటువంటి ప్రేమ లేదన్నారు. చంద్రబాబుని ముఖ్యమంత్రి చేయాలనే ఏకైక లక్ష్యంతో పని చేస్తున్న నాయకుడు పవన్ కళ్యాణ్ అన్నారు. ప్రపంచ దేశాలన్నీ వాలంటీర్ వ్యవస్థ గురించి ప్రశంసిస్తుంటే పవన్ విమర్శించటం సిగ్గు చేటన్నారు. వలంటరీ వ్యవస్థ నడుము ఇరగ కొడతానని మాట్లాడటం పవన్ అహంకారానికి నిదర్శనమన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలను పవన్ కళ్యాణ్ అవమానించినట్లేనని తెలియజేశారు. సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వేముల బేబీరాణి నాయకులు పంచుమర్తి లక్ష్మీ భీమేష్, శ్రీనివాస్ , ఆర్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ చర్యలు దేశ సార్వ భౌమత్వానికే ముప్పు

పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బీజేపీ, మోదీ చేస్తున్న అన్యాయాలను ప్రశ్నిస్తున్నందుకే రాహుల్ గాంధీపై అక్రమ కేసులు బనాయించి చట్ట సభల్లోకి రాకుండా అడ్డుకుంటున్నారని రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు ఆరోపించారు. బుధవారం విజయవాడ అలంకార్ సెంటర్‌లోని ధర్నా చౌక్‌లో ఏపీసీసీ ఆధ్వర్యంలో మౌన సత్యాగ్రహ కార్యక్రమం జరిగింది. కాంగ్రెస్ శ్రేణులు నోటికి నల్లరిబ్బను కట్టుకుని నిరసన తెలుపుతూ రాహుల్ గాంధీకి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా రుద్రరాజు మాట్లాడుతూ దేశం కోసం త్యాగాలు చేసిన కుటుంబం నుంచి రాహుల్‌ను వేధింపులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు.

ఎప్పుడో 2019లో రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై గుజరాత్ వ్యక్తుల ద్వారా అక్రమ కేసులు వేయించారన్నారు. అటువంటి కేసుల్లో రెండేళ్ల జైలు శిక్ష అనేది 165 సంవత్సరాల ఇండియన్ పీనల్ కోడ్ చరిత్రలోనే లేదని తెలిపారు. బీజేపీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ చర్యలు దేశ సమగ్రత, సార్వభౌమత్వానికి భంగం కలిగించే విధంగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మయప్పన్, ఏఐసీసీ కార్యదర్శి క్రిస్టోఫర్, సిరివెళ్ల ప్రసాద్, పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మస్తాన్ వలి, జంగా గౌతమ్, సుంకర పద్మశ్రీ, రాకేష్ రెడ్డి, కొలనుకొండ శివాజీ, ఏఐసీసీ మెంబర్ లీగల్ సెల్ రాష్ట్ర చైర్మన్ వి. గుర్నాథం, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

దాతలు సహకారం అందించాలి

జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు సహకారం అందించేందుకు దాతలు ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు కోరారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని ఇందిరా నాయక్ నగర్‌లో హ్యాపీ లైఫ్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రిటైర్డ్ పోస్టు మాస్టర్ ఆర్.రామచంద్రరావు చుక్కపల్లి ఫౌండేషన్ సహకారంతో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, స్టడీ మెటీరియల్ బుధవారం పంపిణీ చేశారు. కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పాల్గొని విద్యార్థులుకు నోటు పుస్తకాలు, స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ సామాన్య పోస్టు మాస్టర్ ఉద్యోగం చేసిన రామచంద్రరావు పదవీ విరమణ అనంతరం స్వచ్ఛ విజయవాడకు సహకారం అందించేందుకు ముందుకు రావడం అభినందనీయమని చెప్పారు. గత 26 సంవత్సరాల నుంచి పేద విద్యార్థులకు పుస్తకాలు, స్టడీ మెటీరియల్ ఉచితంగా అందిస్తూ ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం విద్యకు తొలి ప్రాధాన్యతనిచ్చి విద్యార్థులకు జగనన్న విద్య కానుక కిట్లను అందిస్తోందన్నారు. వీటితో పాటు రామచంద్రరావు లాంటి దాతలు ముందుకు వచ్చి ప్రతీ సంవత్సరం తమ సహకారాన్ని అందిస్తున్నారన్నారు. నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ విశ్రాంత పోస్టు మాస్టర్ రామచంద్రరావు కాలనీలలో మొక్కలు నాటి స్వచ్ఛత పై దృష్టి పెట్టడం అభినందనీయమన్నారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నోట్‌బుక్స్, స్టడీ మెటీరియల్ అందజేస్తున్న కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు

నగరాలను అన్ని జిల్లాల్లో బీసీలుగా గుర్తించాలి

మంత్రిని కలిసిన నగరాల ప్రముఖులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): నగరాలను అన్ని జిల్లాల్లో బీసీలుగా గుర్తించాలని బీసీ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణను పలువురు నగరాల ప్రముఖులు కోరారు. క్యాంప్ కార్యాలయంలో బుధవారం మంత్రిని బీసీ నగరాల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎన్వీ రావు, కార్పొరేటర్ మరుపిళ్ళ రాజేష్, దుర్గగుడి మాజీ చైర్మన్ పైలా సోమినాయుడులతో పాటు పలు నగరాల సంఘాల ప్రతినిధులతో కలిసి ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు. నగరాలను బీసీలుగా అన్ని జిల్లాలో గుర్తించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు ఇటీవల మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణను కోరడం జరిగిందని, ఈ మేరకు మంత్రిని కలవడం జరిగిందని ఎన్వీ.రావు పేర్కొన్నారు. నగరాల ప్రముఖులు తమ్మిన హేమంత్, మజ్జి శ్రీను, బాయన శేఖర్‌బాబు, పైలా సురేష్, ప్రముఖ న్యాయవాది పిళ్లా రవి, పొట్నూరి శివ, బాయన కనకారావు, శీరం మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణను కలిసిన నగరాల ప్రముఖులు

16న మరో గ్రంథాలయ ఉద్యమ మహాసభ

విజయవాడ కల్చరల్: మరో గ్రంథాలయ ఉద్యమ కమిటీ ఆధ్వర్యంలో 16వ తేదీ సర్వోత్తమ భవన్‌లో గ్రంథాలయ ఉద్యమ సన్నాహక సభ నిర్వహిస్తున్నట్లు నిర్వాహక సంఘ సభ్యుడు మంచికంటి వెంకటేశ్వరరావు తెలిపారు. ఏలూరు రోడ్డు అనేక బుక్ స్టాల్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. గ్రంథాలయాలను ప్రజలందరికీ చేరువ చేయాలని, భాషా వికాసానికి కృషి చేయాలనే సంకల్పంతో సభ ఏర్పాటు చేశామని చెప్పారు. ఉదయం 9 గంటలకు సంకల్పయాత్రతో కార్యక్రమాలు ప్రాంభమవుతాయని పేర్కొన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన సాహితీవేత్తలు, కవులు, రచయితలు సమావేశంలో పాల్గొంటారన్నారు. చర్చలు, పుస్తక ఆవిష్కరణల అనంతరం భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. కవులు, రచయితలు తమ అభిప్రాయం తెలియజేయవచ్చన్నారు. సాహితీవేత్తలు చలపాక ప్రకాష్, కలిమిశ్రీ, మందరపు హైమావతి, అరసవిల్లి కృష్ణ, అలెగ్జాండర్, ఎం.రామకృష్ణ పాల్గొన్నారు. అతిథులు పోస్టర్ ఆవిష్కరించారు.



పోస్టర్ ఆవిష్కరణలో మంచికంటి, చలపాక ప్రకాష్, కలిమిశ్రీ, అరసవిల్లి కృష్ణ తదితరులు

దుర్గమ్మకు సారె సమర్పణ



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆషాఢ మాసం సందర్భంగా ఇంద్రకీలాద్రి పై వేంచేసి ఉన్న కనకదుర్గమ్మ అమ్మవారికి అయోధ్యనగర్ ఇందిరా ఎన్‌క్లేవ్ మహిళలు బుధవారం సారె సమర్పించారు. ఆధ్యాత్మిక ప్రవచకులు బ్రహ్మశ్రీ పసుమర్తి కామేశ్వర శర్మ పాల్గొని మహిళలతో పూజలు చేయించారు. మేళతాళాలు డప్పు వాయిద్యాలతో సారె పట్టుకుని మహిళలు ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సారె సమర్పించారు. నాయకులు శరత్, వసంత శ్రీనివాస్, శైలజ, అరుణ, లీలాకుమారి, సునీత తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి కొత్త హ్యుందాయ్ కారు

ఆటోనగర్(విజయవాడతూర్పు): హ్యుందాయ్ కంపెనీ కొత్త కారును మార్కెట్‌లోకి విడుదల చేశారు. లబ్బీపేటలోని హ్యుందాయ్ షోరూంలో ఈ కొత్త కారును ప్రవేశపెట్టారు. విజయవాడ ఆటోనగర్ బ్రాంచ్‌లో హ్యుందాయ్ ఎక్స్టర్, ఫ్యామిలీ బడ్జెట్‌లో ఫుల్లీ లోడెడ్ (ఎస్‌యూవీ) కారును బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎండీ చుక్కపల్లి సిద్ధార్థ మాట్లాడుతూ హ్యుందాయ్ ఎక్స్టర్ ఫ్యామిలీ బడ్జెట్‌తో వస్తుందన్నారు. అత్యాధునిక టెక్నాలజీతో ఆరు ఎయిర్ బ్యాగ్స్, 60కి పైగా కనెక్టివిటీ ఫ్యూచర్స్‌తో ఉందన్నారు. ఫుల్లీ ఆటోమేటిక్ టెంపరేచర్, క్రూస్ కంట్రోల్ టచ్ స్క్రీన్ ఉందన్నారు. ఎలక్ట్రిక్ సన్‌రూఫ్, హిల్ అసిస్ట్ కంట్రోల్, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్‌తో పాటు రెండు రకాల ఇంజిన్‌లతో పెట్రోలు, బై ఫ్యూయల్ పెట్రోలు, సీఎన్‌జీ ఉన్నాయన్నారు. ఇతర కారులకు ధీటుగా వినియోగదారులకు అందుబాటు ధరలో ఉన్నాయన్నారు. ఈ కారు ప్రారంభం ధర రూ.5.99 లక్షలు అన్నారు. టెస్ట్ డ్రైవ్ కోసం సమీపంలో ఉన్న కుశలవ హ్యుండాయ్ షోరూంను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో టి.వెంకటరెడ్డి, ఎం.నందకిషోర్, ఎస్‌బీఐ మేనేజరు శర్మ, కొటక్ బీఎం సీహెచ్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



కొత్త కారును ప్రారంభిస్తున్న చుక్కపల్లి సిద్ధార్థ తదితరులు